సాక్షి
కుమురం భీం
సోమవారం : 20 : మార్చి : 2023



ఏకరూపం.. ఆకర్షణీయం
సర్కారు పాఠశాలల విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ముడి వస్త్రం కోసం ఆర్డర్ ఇచ్చింది. 8లో▸



అభివృద్ధికి ఆమడదూరం
కెరమెరి మండలం బాబేఝరి పంచాయతీ పరిధి లైన్‌పటార్ గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస సౌకర్యాలు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
31.0 /20.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో రాత్రివేళ చలితీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కట్ట మైసమ్మకు బోనాలు



బోనం ఎత్తుకున్న రమాదేవి, మహిళలు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ ఎల్‌బీఎస్ మార్కెట్ సమీపంలోగల కట్ట మైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొలువుదీరిన అమ్మవారికి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి, మహిళలు బోనాలు సమర్పించారు. అంతకుముందు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చారు.

జిల్లా కేంద్రానికి చేరుకున్న జైన సన్యాసులు



జిల్లా కేంద్రంలో జైనసన్యాసులు

ఆసిఫాబాద్: జైన సంత్ శ్రమన్ సంఘ్ యువాచార్య మహేంద్ర రిషి ఆదివారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జైన్ సమాజ్ ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు. యువాచార్య మహేంద్ర రిషి, ధవల్ రిషి మహారాష్ట్రలోని చంద్రపూర్ నుంచి వాంకిడి మీదుగా కాలినడకన జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. గురు భగవంతోకు ఆసిఫాబాద్ జైన సమాజ్, యువ, మహిళా మండల సభ్యులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇక్కడి నుంచి కాలినడకన హైదరాబాద్‌కు పయనమయ్యారు.

ఆలయానికి రూ.2.50 లక్షల విరాళం



పూజలు చేస్తున్న శ్రీనివాస్-అనిత దంపతులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోగల కట్ట మైసమ్మ ఆలయంలో డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-డాక్టర్ అనిత దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన ఆలయ నిర్మాణానికి రూ.2.50లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

విరాళాలు అందజేత
కాగజ్‌నగర్ రూరల్: చింతగూడ కోయవాగు గ్రామంలో చేపట్టిన శ్రీరామలింగేశ్వర ఆలయ నిర్మాణానికి ఆదివారం దాతలు విరాళాలు అందజేశారు. మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెండుగురె శ్యాంరావు రూ.1,00,116, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ రూ.21వేలు, కోయవాగు గ్రామ ఉపసర్పంచ్ రాజు రూ.51వేలు, బల్లల గ్రామనివాసి జాగరి పోచయ్య రూ.51వేలు విరాళంగా ఇచ్చారు. కోయవాగు సర్పంచ్ లక్ష్మి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, నాయకులు అశోక్, అరుణ్‌లోయా, సుధాకర్, మారయ్య, రమేశ్, మల్లేశ్, మల్లేశ్, రమాకాంత్, శివలింగు, రాజేశ్ పాల్గొన్నారు.

భట్రాజు సంఘం బలోపేతానికి కృషి చేయాలి
ఆసిఫాబాద్‌అర్బన్: భట్రాజు సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కేసిపెద్ది రామరాజు కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జిల్లా భట్రాజు సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పరిశీలకుడు తుమికి శంకర్‌రాజుతో కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడిగా జగన్నాథరాజు, ప్రధాన కార్యదర్శిగా కృష్ణంరాజు, కోశాధికారిగా శ్రీనివాసరాజు, గౌరవాధ్యక్షుడిగా ప్రసాద్‌రాజు, ఉపాధ్యక్షుడిగా మధుసూదన్‌రాజు, సంయుక్త కార్యదర్శిగా నరేందర్‌రాజు, ప్రచార కార్యదర్శిగా సత్యనారాయణ, సలహాదారుగా శ్రీహరి, కార్యవర్గ సభ్యులుగా సుధాకర్, రామరాజు, వంశీ, మొగిలి ఎన్నికయ్యారు. యువజన సంఘం అధ్యక్షుడిగా సాయిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా రేవంత్, ఉపాధ్యక్షుడిగా శశిధర్, సంయుక్త కార్యదర్శిగా సాయిరాజు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా వీనాదేవి, ఉపాధ్యక్షులుగా శైలజ, లక్ష్మి, సంయుక్త కార్యదర్శిగా స్వర్ణలత, కోశాధికారిగా సరోజ, ప్రచార కార్యదర్శిగా అభినయశ్రీ, కార్యవర్గ సభ్యులుగా పూజ, నాగాంజలిని ఎన్నుకున్నారు. నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మంచిర్యాల జిల్లా సంఘం కార్యవర్గ సభ్యులు శ్రీధర్‌రాజు, చంద్రశేఖర్‌రాజు ఉన్నారు.

భత్యం లేనట్లే..



- కూలీలకు దక్కని 'ఉపాధి' హామీ
- వేసవి చెల్లింపులు నిలిపివేత
- ఎన్‌ఎంఎంఎస్ సాఫ్ట్‌వేరే కారణం
- సరిగా నమోదు కాని వివరాలు
- నష్టపోతున్న ఈజీఎస్ కూలీలు

తిర్యాణి: దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రతీ ఒక్కరికి ఏడాదిలో 100 రోజులపాటు పని కల్పించాలనే లక్ష్యంతో 2005లో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ పథకానికి శ్రీకారం చుట్టింది. పథకం ప్రారంభం నుంచి గతేడాది వరకు రాష్ట్రానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఉపాధి పనులకు సంబంధించిన వివరాలు పొందుపర్చేవారు. కానీ.. గతేడాది మార్చి నుంచి కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనుల్లో పారదర్శకత పెంపొందించడం కోసం పనులకు సంబంధించిన వివరాలు ఎన్‌ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయిస్తోంది. కాగా, నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా అనేక చిక్కులు ఏర్పడుతున్నాయి. దీంతో కూలీలు నష్టపోతున్నారు.

పని ఎక్కువ.. కూలి తక్కువ..

ఉపాధిహామీ పథకం రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో ఉన్నప్పుడు కూలీలకు తక్కువ పనిచేసినా ఎక్కువ కూలి వచ్చేది. దీనికి తోడు ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేసవి భత్యం అదనంగా కలిపి ఇచ్చేవారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు రాష్ట్రానికి సంబంధించిన టీసీఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఉండేవి. కానీ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన్ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యానికి సంబంధించిన ఆప్షన్ కనిపించడం లేదు.

జిల్లాలో ఉపాధి కూలీల వివరాలు

జాబ్‌కార్డులు:	1,29,170
కూలీల సంఖ్య:	2,74,271
2022-23 పనిదినాల లక్ష్యం:	45,41,295
ఇప్పటివరకు పూర్తయిన పని దినాలు:	33,23,713

ఫిబ్రవరిలో 20 శాతం, మార్చిలో 25, ఏప్రిల్, మే లో 30శాతం చొప్పున, జూన్‌లో 20 శాతం అదనంగా వేసవి భత్యం పేరుతో పేమెంట్ ఇచ్చేవారు. నూతన సాఫ్ట్‌వేర్ విధానంలో వేసవి భత్యం తీసేయడంతోపాటు రెండు పూటలా పని విధానం, ఆన్‌లైన్ హాజరు నమోదులో తరచూ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సాంకేతిక కారణాలతో జాబ్‌కార్డు ఆధార్ అనుసంధానం కాకపోవడం లాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. దీంతోపాటు పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించకపోవడంతో కూలీలు ఉపాధి పనులకు వెళ్లడానికి వెనుకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు సరాసరిగా 20 శాతం మంది కూలీలు మాత్రమే ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 45,41,295 పనిదినాల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో 10 రోజులు మాత్రమే ఉండగా ఇప్పటివరకు 33,23,713 పని దినాలు మాత్రమే పూర్తయ్యాయి. దీంతో ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడంలేదు.

వేసవి భత్యం అందడం లేదు



ఉపాధిహామీ పనుల కోసం తీసుకువచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్ ద్వారా మేము అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. గతంలో మాకు వేసవి భత్యం ఇచ్చేవారు. సాఫ్ట్‌వేర్ మారడం ద్వారా ఈసారి వేసవి భత్యం రావడం లేదు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే మాకు వేసవి భత్యం ఇస్తేనే కూలి గిట్టుబాటవుతుంది.

– రాయిల్ల నర్సయ్య, ఉపాధి కూలీ, గోలేటి

కూలి గిట్టుబాటు కావడంలేదు



ఎక్కువగా ఉపాధి పనులు చేపట్టే ఫిబ్రవరి నుంచి జూన్ వరకు కూలితోపాటు వేసవి భత్యం పేరుతో అదనంగా 20–30శాతం వరకుడ ఇచ్చేవారు. దీంతో పనికి తగిన వేతనం అందేది. ప్రస్తుతం వేసవి భత్యాన్ని తీసేయగా రోజుకు రూ.150 నుంచి రూ.180 మాత్రమే వస్తున్నాయి. వేసవి భత్యాన్ని అందించాలి.

– కోట సుభాష్, ఉపాధి కూలీ, దుగ్గపూర్

భత్యం పైనుంచే రావడం లేదు
గతేడాది నుంచి ఎన్‌ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. ఇందులో వేసవి భత్యానికి సంబంధించి ఎలాంటి వివరాలు రావడం లేదు. గతంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యం ఉండేది. నూతన సాఫ్ట్‌వేర్‌లో వేసవి భత్యం లేకుండానే కూలీలకు వేతనాలు జమచేస్తున్నారు.

– శ్రవణ్‌కుమార్, ఏపీవో, వాంకిడి

నిరుపయోగంగా
వైకుంఠధామాలు



రాస్పెల్లిలో నిరుపయోగంగా వైకుంఠధామం



పెద్దవాగు ప్రవాహానికి కొట్టుకుపోయిన అందవెల్లి వైకుంఠధామం

- కొన్ని పెద్దవాగు ప్రవాహానికి కొట్టుకుపోగా.. వసతులు లేక మరికొన్ని వృథా
- అవగాహన కల్పించని అధికారులు
- నెరవేరని ప్రభుత్వాల లక్ష్యం
- చివరి మజిలీకి తప్పని ఇబ్బందులు
- వినియోగంలోకి తేవాలంటున్న ప్రజలు

కాగజ్‌నగర్ రూరల్: చివరి మజిలీకి కష్టాలు ఎదురుకావద్దనే సదుద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి భాగస్వామ్యంతో జిల్లాలో వైకుంఠధామాల నిర్మాణాలు చేపట్టాయి. కాగా, అధికారుల ముందుచూపు లేక నిర్మించిన వాటిలో కొన్ని వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. మరికొన్ని నిరుపయోగంగా మారాయి. పల్లెప్రగతిలో భాగంగా జిల్లాలోని ఆయా గ్రామాల్లో వైకుంఠధామాలు నిర్మించి ఏడాది గడుస్తున్నా ప్రజలు వాటిని వినియోగించుకునేందుకు ముందుకురావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. జిల్లాలో 335 గ్రామపంచాయతీలుండగా 334 చోట్ల వైకుంఠధామాలు నిర్మించారు. సిర్పూర్ (టీ) మండలంలోని ఇటికల్‌పహాడ్ గ్రామంలో మాత్రం టైగర్‌జోన్ ప్రాంతం కావడంతో ఫారెస్ట్ అధికారుల నుంచి అనుమతులు లభించలేదు. దీంతో స్థలం కొరతతో ఈ గ్రామంలో నిర్మాణం చేపట్టలేదు. మిగతా గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ కింద ఒక్కో వైకుంఠధామాన్ని రూ.12.50 లక్షలతో నిర్మించారు. కానీ.. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించలేదు. విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వైకుంఠధామాలు వినియోగంలోకి రాలేదు.

వరదలకు కొట్టుకుపోయి..

పెద్దవాగు పరీవాహక ప్రాంతాలైన దహెగాం మండలంలోని పెసరికుంట, చౌక, లగ్గాం, ఒడ్డుగూడ, కాగజ్‌నగర్ మండలంలోని అందవెల్లి, భట్‌పల్లి గ్రామాల్లోని వైకుంఠధామాలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. వాంకిడి మండలంలో చిక్లి వాగు పరీవాహక ప్రాంతమైన వాంకిడి, ఖమానా గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు కొట్టుకుపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మించిన వైకుంఠధామానికి దారి లేక నిరుపయోగంగా మారింది.

అవగాహన కరువు

వైకుంఠధామాలపై ప్రజలకు సరైన అవగాహన లేక నిరుపయోగంగా మారుతున్నాయి. దీనికి తోడు వీటిని గ్రామాలకు దూరంగా నిర్మించడంతో ప్రజలు వినియోగించేందుకు ఆసక్తి చూపించడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైకుంఠధామాల్లో మౌలిక వసతులు కల్పించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



వైకుంఠధామాల్లో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించాలి. ప్రజలకు సరైన అవగాహన లేక నిరుపయోగంగా మారుతున్నాయి. అవగాహన కల్పించి వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– దత్తు, తాటిపెల్లి, కౌటాల మండలం

ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం



రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన వైకుంఠధామాలు ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే నిరుపయోగంగా మారాయి. వాగులకు ఆనుకుని వైకుంఠధామాలు నిర్మించడంతో అవి వరదలకు కొట్టుకుపోయాయి. అధికారుల అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనం వృథా అయింది.

– ఉమ్మెర లింగయ్య, మాజీ సర్పంచ్, మర్తిడి

సౌకర్యాలు కల్పిస్తాం
వైకుంఠధామాలకు విద్యుత్ లైన్లు దూరంగా ఉన్న చోట సోలార్‌యంత్రాలు ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం. నీటి సౌకర్యం కోసం బోర్‌వెల్ నిర్మాణాలు చేపడతాం. ప్రజల్లో అవగాహన కల్పించి వైకుంఠధామాలు వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి, ఆసిఫాబాద్

గంగస్నానాల కోనేరు ప్రారంభం



కోనేరు వద్ద కోనప్ప దంపతులు, బెంగాలీలు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నంబర్–1 గ్రామంలో గంగస్నానాల కోనేరును ఆదివారం ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సతీమణి రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంగస్నాన ఘాట్లను మరో రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బెంగాలీలు ఎమ్మెల్యే దంపతులకు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్నానాలు ఆచరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గంగస్నానాలాచరించిన బీజేపీ నాయకులు

బెంగాలీ గురువు హరిచరణ్ ఠాకూర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మతువా మహాసంఘ అధ్వర్యంలో నిర్వహించిన బరోని స్నాన్ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు హరీశ్‌బాబు గంగస్నానమాచరించారు. అనంతరం గంగస్నానాలకు వచ్చిన బెంగాలీలకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, నాయకులు కొంగ సత్యనారాయణ, గోలెం వెంకటేశ్, కాళిదాస్ ముజుందార్, దోని శ్రీశైలం, బికాస్ ఘరామి, అనుపమ ఘరామి, దోతుల శ్రీనివాస్, అరుణ్‌లోయా, విజయ్ ఘరామి, మాచర్ల శ్రీనివాస్, ముత్తు అశోక్, రాజేందర్ జాంజోడ్, సమీర్‌గుప్త, కృష్ణస్వామి, గోవింద్‌మండల్, అనుతోష్‌మండల్, రన్‌వీర్‌బిశ్వాస్, ముక్కెర శేఖర్, దుర్గం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆరాధ్య వీరుడు కుమురంభీం

- జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి
- మర్కగూడలో విగ్రహావిష్కరణ



భీంకు నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీలు

వాంకిడి: ఆదివాసీల ఆరాధ్య వీరుడు కుమురంభీం అని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నవెధరి గ్రామపంచాయతీ పరిధి మర్కగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన కుమురంభీం విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివాసీలు కుమురంభీంను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. యువత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం విగ్రహావిష్కరణను పురస్కరించుకుని నిర్వహించిన కబడ్డీ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన గోండ్వాన పంజా, డీజే పటాస్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీపీ ముండె విమలాబాయి, జెడ్పీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచులు అడ జైరాం, కిష్టు, కమలాకర్, ఐటీడీఏ డైరెక్టర్ సాయం బాపురావు, బీఆర్‌ఎస్ యువ నాయకుడు దీపక్ ముండె తదితరులు పాల్గొన్నారు.

జనచైతన్య యాత్ర పోస్టర్ ఆవిష్కరణ
ఆసిఫాబాద్‌అర్బన్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ మార్చి 23నుంచి 29వ తేదీ వరకు సీపీఎం అఖిల భారత కమిటీ పిలుపు మేరకు నిర్వహించనున్న జనచైతన్య యాత్ర పోస్టర్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యవర్గ సభ్యుడు దినకర్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సంక్షేమం, మతసామరస్యం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. జనచైతన్య యాత్ర ఈనెల 24న జిల్లాకు చేరుకొంటుందని, కాగజ్‌నగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. నాయకులు లోకేశ్, గొడిసెల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో 'పది' పరీక్షలు

- జిల్లా వ్యాప్తంగా 39 పరీక్ష కేంద్రాలు
- అన్ని సెంటర్లలో సీసీ కెమెరాలు
- సీఎస్ గదిలోనూ ఏర్పాటుకు చర్యలు
- పరీక్షలు పారదర్శకంగా నిర్వహణకే..



జిల్లా సమాచారం

పాఠశాలలు:	169
విద్యార్థులు:	7,108
బాలికలు:	3,340
బాలురు:	3,768
పరీక్ష కేంద్రాలు:	39

ఆసిఫాబాద్‌అర్బన్: ఏప్రిల్ 3నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా పరీక్ష కేంద్రాల వద్ద జిల్లా విద్యాశాఖ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తోంది. పరీక్షల నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించేందుకు కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేయగా ఈ మేరకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈసారి అన్ని కేంద్రాల్లోని పర్యవేక్షకుల (సీఎస్) గదుల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

మాస్ కాపీయింగ్‌ను అరికట్టడానికే..

పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్, అక్రమాలను నిరోధించేందుకు ప్రతీచోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రశ్నపత్రాలు పోలీస్‌స్టేషన్‌లోనే భద్రపరుస్తున్నారు. పరీక్ష జరిగే రోజున ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాల్లో సీఎస్, డిపార్ట్‌మెంటల్ అధికారి, పోలీస్ భద్రత మధ్య తెరుస్తారు. ప్రతీ సెంటర్‌కు పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందు కవర్ సీల్‌ను తీసి గదుల వారీగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పంపిణీ చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. తొలుత సీఎస్, డీఈవో, ఇన్విజిలేటర్లు ప్రశ్నపత్రాల కవర్లపై సంతకం చేసి సమయానికి తెరుస్తారు. పరీక్షలు పూర్తయ్యాక జవాబు పత్రాలు సీల్ చేసేంతవరకూ వీరి పర్యవేక్షణలోనే ప్రక్రియ జరుగుతుంది. ఈ ప్రక్రియ పూర్తిగా సీసీ కెమెరాల్లో రికార్డు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా కార్పొరేట్ పాఠశాలల వారు ప్రశ్నపత్రాలను లీక్ చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలోనే పరీక్షలను నిఘా నీడలో నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. చివరి పరీక్ష పూర్తయ్యాక సీసీ పుటేజీలను సీల్డ్ కవర్‌లో డీఈవోకు అందజేయాల్సి ఉంటుంది. పరీక్ష సమయం ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు నిర్ణయించారు. నిమిషం ఆలస్యం కాకూడదనే నిబంధన కాకుండా ఐదు నిమిషాల వరకు సమయాన్ని పొడిగించారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగా చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

పారదర్శకత కోసమే..
పదో తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 39 సెంటర్లు ఏర్పాటు చేశాం. ఇందులో రెగ్యులర్ వారికి 36 కాగా, మూడు ప్రైవేట్ అభ్యర్థుల కోసం కేటాయించాం. ప్రైవేట్ సెంటర్లలో యాజమాన్యాలే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. కొత్తగా సీఎస్ గదుల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. తద్వారా పరీక్షల నిర్వహణ పూర్తి పారదర్శకంగా ఉంటుంది.

– అశోక్‌కుమార్, డీఈవో

నేటి నుంచి హాథ్ సే హాథ్ జోడోయాత్ర



మాట్లాడుతున్న కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

ఆసిఫాబాద్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర సోమవారం నుంచి జిల్లాలో కొనసాగనుందని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని తిరుమల లాడ్జిలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, పాదయాత్ర కోఆర్డినేటర్ సయ్యద్ అంజుముల్లా హుస్సేన్‌తో కలిసి ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఆరురోజులపాటు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 20న జైనూర్ మండలంలో ప్రారంభమై 21న సాయంత్రం కెరమెరి మండలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. 22, 23 తేదీల్లో ఉగాదిని పురస్కరించుకొని యాత్రకు స్వల్ప విరామం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న మళ్లీ యాత్ర ప్రారంభమై 25న జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ చౌక్ వద్ద కార్నర్ సమావేశం లేదా ప్రేమల గార్డెన్స్ వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. 26, 27 తేదీల్లోనూ జిల్లాలో యాత్ర కొనసాగి 27న సాయంత్రం మంచిర్యాలకు చేరుకుంటుందని వివరించారు. యాత్రలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో పూర్తిగా వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎల్డీం ఇన్‌చార్జి పెన్నింటి రఘునాథ్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అనిరుధ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కోట్ల నాగేశ్వర్‌రావు, పీసీసీ కార్యదర్శి మర్సకోల సరస్వతి, నాయకులు రాథోడ్ గణేశ్, గుండ శ్యాం, రవీందర్ ఎడ్లి, దుర్గం సోమయ్య, చునార్కర్ వసంత్‌రావు, మసాదే చరణ్, దుర్గం జీవన్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదుపు తప్పి కారు బోల్తా



ధ్వంసమైన కారు

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారిపై భీమారం కలప డిపో సమీపంలో శనివారం రాత్రి కారు అదుపు తప్పి పక్కనే ఉన్న కంకర కుప్పను ఢీకొని బోల్తా పడిందని ఏఎస్సై భూమన్న తెలిపారు. భీమారం గ్రామానికి చెందిన రంజిత్ కారు ప్రమాదానికి గురికాగా, ఆయనకు స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

సిర్పూర్(టి): మండలంలోని హుడ్కిలి గ్రామానికి చెందిన చందన్‌ఖడె తేజస్ అనే యువకుడితో పాటు మరికొందరికి ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేశాడు. సిర్పూర్(టీ) ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హుడ్కిలి గ్రామానికి చెందిన చందన్‌ఖడె తేజస్‌కు 8555005493 నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి మిషన్ భగీరథలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. మండలంలోని 10 మంది యువకుల నుంచి రూ.4,500 చొప్పున మొత్తం రూ.49,500 గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా వసూలు చేసి మోసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టవేరా చోరీ

జైనథ్: మండల కేంద్రానికి చెందిన ఉల్లాస్‌కు టవేరా వాహనం చోరీకి గురైంది. బాధితుడు, పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఉల్లాస్ ఈనెల 16న రాత్రి ఇంటి ఎదుట టవేరా వాహనం నిలిపాడు. ఉదయం లేచి చూడగానే కనిపించ లేదు. రెండు రోజుల పాటు వాహనం కోసం గాలించాడు. అచూకీ దొరకకపోవడంతో చోరీకి గురైంది భావించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఆదివారం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యంషాపులో దొంగతనం

కాసిపేట: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దనపల్లి మద్యం షాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. స్వీపర్ యశోద ఆదివారం ఉదయం ఊడ్చేందుకు వెళ్లగా తాళం పగిలిఉండడాన్ని గమనించి మద్య షాపు ఓనర్‌కు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రెండు సీసీ కెమెరాలు ధ్వంసం చేశారని, సుమారు రూ.20వేల విలువైన మద్యం బాటిళ్లు, రూ.20వేల నగదు, రూ.18విలువైన సెల్‌ఫోన్ చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు సోమగూడెం పోలీస్‌స్టేషన్‌లో చల్ల చిన్నయ్య ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు.

ఎడ్లబండి పైనుంచి పడి ఒకరు మృతి

ఆసిఫాబాద్‌రూరల్: ఎడ్లబండి పైనుంచి కింద పడి ఒకరు మృతి చెందారు. ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. మాలన్‌గొంది గ్రామానికి చెందిన సిడెం మారు(46) అంకుసాపూర్ సర్పంచ్ బలరాం ఇంట్లో పాలేరుగా పని చేస్తున్నాడు. ఉదయం ఇంటి నుంచి అడవికి కట్టెల కోసం ఎడ్లబండిపై వెళ్తుండగా కోసార గ్రామ శివారులో ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మారుకు భార్య, నలుగురు పిల్లలున్నారు. భార్య అన్నిబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏకరూపం.. ఆకర్షణీయం

- స్కూల్ యూనిఫాం డిజైన్ మార్చిన విద్యాశాఖ
- వేసవి సెలవుల్లోనే కుట్టించేలా చర్యలు
- పాఠశాలలు తెరిచే నాటికి విద్యార్థులకు అందుబాటులోకి..

మంచిర్యాలఅర్బన్: మన ఊరు–మన బడితో పాఠశాలల రూపురేఖలను మార్చుతున్న ప్రభుత్వం ..అదే తీరున విద్యార్థులకు అందించే దుస్తులకు సైతం కార్పొరేట్ లుక్ ఉండేలా చూస్తోంది. సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు అందించే యూనిఫాం 2023–24 సంవత్సరానికి గాను జాప్యం కాకుండా ముందుస్తు చర్యలు చేపట్టింది. ఇప్పటికే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా లెక్కలు తీసి అవసరమైన ముడి వస్త్రం ఆర్డర్ ఇచ్చింది. ఈ నెలాఖరు వరకు జిల్లాలకు నూతన ముడి వస్త్రం వచ్చేలా చర్యలు చేపడుతోంది. గతేడాది యూనిఫాం పంపిణీలో జాప్యం కారణంగా పంద్రాగస్టుకు కూడా పాత దుస్తులే ధరించాల్సి వచ్చింది. ఈనేపథ్యంలో నూతన విద్యాసంవత్సరం పాఠశాలల ప్రారంభం నుంచే యూనిఫాం అందించేలా ప్రణాళికలు రూపొందించింది. ముడి వస్త్రం జిల్లాకు చేరగానే సెలవుల్లోనే దర్జీ వద్దకు చేర్చి అక్కడి నుంచి పాఠశాల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు అందించాలని సర్కారు ఏర్పాట్లు చేస్తోంది.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3, 481 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,18,853 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరందరికీ వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల పునఃప్రారంభం నాటికి రెండు జతల యూనిఫాం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన ముడివస్త్రం టెస్కో నుంచి 10,80,447 మీటర్లు ఉమ్మడి జిల్లాకు సరఫరా చేయనుంది. మొదట నేరుగా ఎమ్మార్సీలకు అక్కడి నుంచి పాఠశాల స్థాయికి చేర్చనున్నారు. హైస్కూళ్లలో హెచ్‌ఎంలకే దుస్తులు కుట్టించే బాధ్యతలు అప్పగించారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం కుట్టించే బాధ్యతను కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు అప్పగించారు. ఏమాత్రం జాప్యం జరుగకుండా వేసవి సెలవులు ముగిసే నాటికి యూనిఫాం స్టిచ్చింగ్ పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటారు.



మార్చిన డిజైన్లు ఇవే

సరికొత్తగా యూనిఫాం..

వచ్చే విద్యాసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం సరికొత్తగా డిజైన్ చేశారు. రంగు మార్చకుండా డిజైన్ మాత్రమే మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు విధి విధానాలు రూపొందించారు. 1 నుంచి 3వ తరగతి బాలికలకు బాడీఫ్రాక్‌లు, రైట్‌సైడ్ లోపలికి ఒకపాకెట్, ఎదురు కుచ్చిళ్లు, 2 ఇంచులు పట్టీతో కుట్టనున్నారు. బాడీ ఫ్రాక్‌కు కింద షర్టుక్లాత్‌తో 2 ఇంచులు వెడల్పు పట్టి, బెల్ట్ రింగులు సూటింగ్ క్లాత్‌తో కుట్టనున్నారు. షర్టుకు చేతులకు పట్టీలు, క్లిప్‌లు, షూటింగ్ క్లాత్‌తో వేయాల్సి ఉంది. క్లిప్ పొడవు 3 ఇంచులు, వెడల్పు ఇంచుతో యూనిఫాం డిజైన్ రూపొందించారు. ఇక 4, 5 తరగతుల బాలికలకు స్కర్ట్, కుచ్చిళ్లు పెట్టి కుట్టాల్సి ఉంటుంది. చొక్కాకు రెండు జేబులు కుట్టడం, చొక్కా మధ్యలో షూటింగ్ క్లాత్‌తో పట్టి, బుజాలపైన క్లాపులు, రెండు చేతులకు క్లిప్పులతో దుస్తులు(హ్యాండ్ లూప్స్) తీర్చిదిద్దనున్నారు. 6 నుంచి 12వ తరగతి వరకు బాలికలకు పంజాబీ డ్రెస్ డిజైన్ చేశారు. టాప్, రెండు చేతులకు క్లిప్‌లు, ముందు భాగాన యు ఆకారంలో వాస్కోటు తదితర మార్పులు చేశారు. 1 నుంచి 12వ తరగతి వరకు బాలురుకు షర్టుకు రెండు జేబులు, పట్టీలు, చేతులకు క్లిప్‌లు, భుజాలకు క్లాపులు గుండీతో పెట్టి కుట్టాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగానే నిక్కర్, ప్యాంట్ అందించనున్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు తెరిచేనాటికి యూనిఫాం అందించేందుకు చర్యలు చేపట్టాం. యూనిఫాంల డిజైన్ మార్చుతూ విధివిధానాలు ఖరారయ్యాయి. ఈనెలాఖారు వరకు జిల్లాకు టెస్కో ద్వారా ముడి వస్త్రం ఎమ్మార్సీలకు చేరుతుంది. అక్కడి నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తాం. పాఠశాలలు పునఃప్రారంభం నాటికే దుస్తులు అందిస్తాం.

– వెంకటేశ్వర్లు, డీఈవో, మంచిర్యాల

జిల్లాల వారీగా పాఠశాలలు, విద్యార్థులు, అవసరమయ్యే వస్త్రం వివరాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	కావాల్సిన వస్త్రం(మీటర్లలో)
మంచిర్యాల	805	45,309	2,32,750
ఆదిలాబాద్	1,194	73,582	3,40,567
నిర్మల్	735	54,227	2,67,055
ఆసిఫాబాద్	747	46,735	2,40,075

అపూర్వం.. ఆత్మీయం



1988-89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

భీమారం/రామకృష్ణాపూర్: మూడు, నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం ఒక్కచోట కలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. మతకు విద్యాబుద్ధులు నేర్పి తమ ఎదుగుదలకు దోహదం చేసిన గురువులను సన్మానించారు. ఇందుకు భీమారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, రామకృష్ణాపూర్‌లోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వేదికైంది. భీమారం జెడ్పీ పాఠశాలలో 1981–82 పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 42 సంవత్సరాల అనంతరం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడం సంతోషంగా ఉందని పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు. గరువులు పద్మాకర్‌రావు, దిగంబర్‌రావు, ప్రభాకర్‌రావు, సారంగపాణి, రాంరెడ్డి, శంకరయ్య, రాజలింగంను సన్మానించారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనం ఆనందంగా సాగింది. క్యాతనపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సమ్మేళనంలో సుమారు 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 35 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారు ఆనందంలో మునిగిపోయారు. చిన్ననాటి అనుభూతులు, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థి నల్లాల మురళి ఆధ్వర్యంలో సమ్మేళనం నిర్వహించారు.



భీమారంలో జరిగిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న అప్పటి ఉపాధ్యాయులు, విద్యార్థులు

రెండు బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

బెల్లంపల్లిరూరల్: రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని నలుగురు యువకులు గాయపడిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. దహెగాం మండలం గిరివెల్లి గ్రామానికి చెందిన ఆర్.నవీన్, సీహెచ్ సాయి తమ ద్విచక్రవాహనంపై ఆదివారం రాత్రి గిరివెల్లి నుంచి బెల్లంపల్లికి వస్తున్నారు. కన్నెపల్లి మండలం పోలంపల్లికి చెందిన కె.ఫరీద్, సికినం గ్రామానికి చెందిన కె.వేణు బెల్లంపల్లి నుంచి కన్నెపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరి వాహనాలు బెల్లంపల్లి మండలం చెర్లపల్లి గ్రామ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నవీన్, సాయిలు తీవ్రంగా గాయపడగా, ఫరీద్, వేణులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న తాళ్లగురిజాల ఏఎస్సై రాజన్న, కానిస్టేబుల్ మహేందర్, సిబ్బంది జమీల్ అక్కడికి చేరుకుని గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు తరలించారు. ఈ మేరకు తాళ్లగురిజాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలతో సాయి

గేట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వర్సిటీ డైరెక్టర్ సతీష్‌కుమార్

భైంసా(ముధోల్): గేట్–2023 ఫలితాల్లో బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు ఆల్‌ఇండియా స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన చైతన్య 293వ ర్యాంకు, మణిప్రసాద్ 912వ ర్యాంకు, జగదీశ్ 234వ ర్యాంకు, శివకుమార్ 563వ ర్యాంకు సాధించారు. ఆదివారం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ కుమార్ విద్యార్థులను అభినందించారు. ఈసీఈ శాఖాధిపతి కార్తీక్, అధ్యాపకులు ధీరజ్, ప్రణయ, తేజస్విని, నీలిమ, పాల్గొన్నారు.

సమ్మేళనం పేరుతో సొమ్ములు స్వాహా

- పూర్వ విద్యార్థుల ఆవేదన
- నిర్వాహకులపై మండిపాటు
- పోలీసులకు ఫిర్యాదు



మాట్లాడుతున్న సింగరేణి స్కూల్ పూర్వ విద్యార్థులు

శ్రీరాంపూర్: పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం పేరుతో లక్షల్లో డబ్బులు వసూలు చేసి తప్పుడు లెక్కలు చూపి, తమ సొమ్ములు స్వాహా చేశారని సింగరేణి కాలరీస్ హైస్కూల్ అలుమిని అసోసియేషన్ నాయకులు తెలిపారు. సీసీసీలోని సింగరేణి స్కూల్ వద్ద ఆదివారం అన్ని బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు, అసోసియేషన్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రవి శంకర్, ఉపాధ్యక్షులు పీ.రాజబాబు రెడ్డి, పప్పు శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిబ్రవరి 12న ఇక్కడ పాఠశాల వద్ద 1986–2022ల టెన్త్ బ్యాచ్‌లతో పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. తమతో పాటు చదువుకున్న ఒకరు ఈ కార్యక్రమం చేద్దామని ముందుగా ప్రతిపాదన పెట్టి నమ్మించడంతో, కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యత అతడి చేతుల్లో పెట్టినట్లు తెలిపారు. అతడు మరో ముగ్గురుని కలుపుకొని సంయుక్తంగా ఒక బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి డబ్బులు అందులో జమ చేసుకున్నారన్నారు. పెద్దయెత్తున కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పడంతో అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు స్వచ్ఛందంగా కొంత బ్యాంక్ అకౌంట్‌కు, మరికొంత నగదు రూపంలో విరాళాలు ఇచ్చారు. ఇలా మొత్తం సుమారు రూ.40లక్షల వరకు జమ అయ్యాయన్నారు. ఇంత పెద్దయెత్తున డబ్బులు వసూలు చేసినకూడా కార్యక్రమానికి హాజరైన వారికి సరైన తిండి పెట్టలేదని, ఒంటెద్దు పోకడలతో అందరిని కలుపుకోకుండా కార్యక్రమం చేయడం వల్ల పూర్తిస్థాయిలో విజయవంతం కాలేదన్నారు. చివరికి తప్పుడు లెక్కలు చూపి ఫండ్‌ను దిగమింగారని ఆరోపించారు. కార్యక్రమానికి ఎంత ఖర్చు అయ్యిందో చెప్పమంటే సరైన లెక్కలు చూపకుండా అడిగితే బెదిరిస్తున్నారన్నారు. తప్పుడు లెక్కలతో కొన్ని లక్షల రూపాయలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. స్కూల్ పేరుతో ట్రస్ట్ ఓపెన్ చేసి తాము చదువుకు, పాఠశాలకు ఏదైనా చేయుతనందిస్తారనుకుంటే మొత్తం డబ్బులను స్వాహా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఈ నలుగురిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తాము సీసీసీ నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాసరి ప్రభాకర్, చంద్రిక, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, జాఫర్, అనిల్‌కుమార్, భూపతి శ్రీనివాస్, బొద్దున రమేశ్, సలీం పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి

భైంసాటౌన్(ముధోల్): పట్టణంలోని సాత్‌పూల్ వంతెన సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు పట్టణ సీఐ ఎల్ శ్రీను తెలిపారు. మహారాష్ట్రలోని భోకర్ తాలూకా బేంద్రి గ్రామానికి చెందిన గడేకర్ గణపత్(60) శనివారం రాత్రి ఆటోలో భైంసాలోని బంధువుల ఇంటికి వస్తుండగా భైంసాలోని సాత్‌పూల్ వద్ద ఆటో బోల్తా పడడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు నాందేడ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

నార్నూర్: మండలంలోని పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడడంతో ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సీఐ ప్రేంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా లింగాపూర మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన సోయం శ్రీనివాస్ (28) బైక్‌పై నార్నూర్ మండలంలోని పూసిగూడ గ్రామంలో తన బంధువు పెళ్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో పూసిగూడ ఘాట్ వద్ద బైక్ అదుపు తప్పింది. బైక్ అతడిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి తమ్ముడు సోయం రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వాంకిడి: పేకాడుతూ పట్టుబడిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై డీ సాగర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మండల కేంద్రంలోని ఇంద్రానగర్ కాలనీలోగల పేకాట స్థావరంపై ఎస్సై తన సిబ్బందితో ఆదివారం దాడి చేశారు. పేకాడుతున్న తొమ్మిదిమందిని పట్టుకున్నారు. వారి నుంచి రూ.23,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆదిలాబాద్ రూరల్: మండలంలోని అర్లి(బి) శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. అర్లి(బి) గ్రామానికి చెందిన నలుగురు, అడ, కంట గ్రామానికి చెందిన ఒ కరు చొప్పున ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.19,360 నగదు, 5 ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నిర్మల్ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంటున్న సాహితి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన సాహితి ముధుల్కర్ ఇంజినీరింగ్‌లో అత్యుత్తమ మార్కులు సాధించి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది. గత విద్యా సంవత్సరం జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇంజినీరింగ్‌లో అన్ని బ్రాంచ్‌లలో అత్యధిక మార్కులు సాధించింది. యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్ గోల్డ్ మెడల్, ప్రశంసపత్రం అందజేశారు. సదరు విద్యార్థినిని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పీజీ రెడ్డి, అధ్యాకులు రవికుమార్, శ్రీహరి, నర్సయ్య అభినందించారు.


గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



శ్రీనివాస్‌గౌడ్ (ఫైల్)

చెన్నూర్: పట్టణానికి చెందిన పబ్బా శ్రీనివాస్‌గౌడ్(49) అనే వ్యక్తి ఇందారం సమీపంలో గల గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. శ్రీనివాస్‌గౌడ్ కొంత కాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడని, శనివారం ఇంట్లో నుంచి వెళ్లిన వ్యక్తి ఎంతకూ తిరిగి రాకపోవడంతో స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందారం గ్రామ సమీపంలో గోదావరినదిలో ఆదివారం శ్రీనివాస్‌గౌడ్ మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోలీసులు చెన్నూర్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. శ్రీనివాస్‌గౌడ్ భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసుదేవరావు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కల్వర్టులో కూరుకుపోయిన బోర్‌వెల్ వాహనం



మందమర్రిరూరల్: పట్టణంలోని రామన్ కాలనీ ఏరియాలో కూలిపోయిన కల్వర్ట్‌పై నుంచి వెళ్తున్న బోర్‌వెల్ వాహనం శనివారం రాత్రి కూరుకుపోయింది. దీంతో అటువైపుగా వెళ్లే ప్రజలకు ఇబ్బంది ఏర్పడింది. కల్వర్ట్ కూలిపోయిందని ఇదివరకు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వెంటనే మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

పాముకాటుతో వృద్ధ మహిళ మృతి

మంచిర్యాలక్రైం: పాతమంచిర్యాలకు చెందిన బోయిన భూమక్క(70) పాము కాటుతో మృతి చెందినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. భూమక్క భర్త ఉదయ్ 7సంవత్సరాల క్రితం, ఆమె కూతురు 3సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మరణించారు. అప్పటినుంచి భూమక్క ఒంటరిగా కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 12న ఇంటి సమీపంలో పాము కాటు వేయగా స్థానికులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మూడు రోజుల చికిత్స అనంతరం, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా అక్కడ 4రోజులు చికిత్స అందించి, హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు. స్థానిక వీఆర్‌ఏ ఎండీ నబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

- ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి
- మెనూ పాటించడం లేదని పీవోకు ఫిర్యాదు
- వార్డెన్‌ను తొలగించాలని ఆర్‌సీవోకు ఆదేశాలు



విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

నార్నూర్: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. మూడు రోజులుగా మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో శ్వాస సంబంధిత సమస్యతో బాధపడుతూ.. 15 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలవడంతో ఆదివారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. రిమ్స్ వైద్యులు నిర్వహించిన వైద్య శిబిరాన్ని పరిశీలించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆర్‌సీవో గంగాధర్, ప్రిన్సిపాల్‌తో సమావేశమై ఘటన గురించి ఆరా తీశారు. మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వార్డెన్‌ను వెంటనే తొలగించాలని ఆర్‌సీవోను ఆదేశించారు. బయటకు వచ్చిన పీవోకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆరు నెలలుగా విద్యార్థులకు గుడ్లు, పల్లిపట్టిలు ఇవ్వడం లేదన్నారు. మెనూ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పీవో మాట్లాడుతూ.. విద్యార్థులు మినరల్ నీరు తాగడంతో పాటు రక్తహీనత, న్యూట్రీషన్, కాల్షియం తక్కువగా ఉండడంతో శ్వాస సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పాఠశాల సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

పోతెపల్లిలో గ్రామసభ



మాట్లాడుతున్న కార్యదర్శి రాకేశ్

పెంచికల్‌పేట్: మండలంలోని పోతెపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దాసరి చంద్రమౌళి అధ్యక్షతన ఆదివారం అంత్యోదయ మిషన్ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామ సమస్యలను పలువురు సభా దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ కార్యదర్శి రాకేశ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యారంగ సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా జిల్లాకేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని అధికారులు వెంటనే స్పందించి నూతన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు సాయి, సాయిచరణ్, ప్రణీత్, కోటేష్ తదితరులు ఉన్నారు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న సీఐ, ఎస్సై

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని కోసిని పంచాయతీ పరిధిలోని కొలాంగూడలో పోలీసులు మీకోసంలో భాగంగా ఆదివారం నిరుపేదలకు బియ్యం పంపిణీ చేశారు. 20 పేద కుటుంబాలకు 5 క్వింటాళ్ల బియ్యం, పండ్లు, చిన్నారులకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు మాట్లాడుతూ బడీడు పిల్లలను పాఠశాలకు పంపించాలన్నారు. అటవీ జంతువులను వేటాడానికి విద్యుత్ తీగలు అమర్చవద్దన్నారు. రూరల్ ఎస్సై సోనియా, తదితరులు ఉన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీ విశ్వశాంతి హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు పలువురినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపాల్ లంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఇన్‌చార్జి హారిక, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు సునీత గుప్తా, రమేశ్, సానియా, మలిహా, రాజయ్య పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్

కౌటాల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుడ్లబోరి గ్రామంలో కోనేరు యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలను ఆయన పరిశీలించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో క్రీడాకారులకు ఉచితంగా క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నా రు. సర్పంచ్ రాందాస్, నిర్వాహకులు బాలాజీ, వినోద్, సునీల్, ప్రవీణ్, అజయ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు కొత్త శోభ!

- గ్రామాల్లో జోరందుకున్న సీసీరోడ్ల నిర్మాణాలు
- మండలానికి రూ.2.67కోట్లతో 66రోడ్లు మంజూరు
- ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం



దేవులగూడలో కొనసాగుతున్న సీసీరోడ్ల నిర్మాణ పనులు

రెబ్బెన: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న సీసీరోడ్ల నిర్మాణాలతో గ్రామాలు కొత్త శోభ సంతరించుకుంటున్నాయి. చిన్నపాటి వర్షాలకే బురదమయంగా మారే అంతర్గత రోడ్లకు ఈజీఎస్ పుణ్యమా అని మహర్దశ పట్టింది. ప్రాధాన్యత క్రమంలో గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని అన్ని పంచాయతీల్లో రోడ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఇప్పటికే మొదటి విడుతలో మంజూరైన రోడ్ల నిర్మాణ పనులు చివరిదశకు చేరుకోగా రెండో విడుతలో మంజూరైన వాటిలో కొన్ని రోడ్ల పనులు ప్రారంభమయ్యాయి. మిగిలిన వాటి కోసం మెటీరియల్ సిద్ధం చేసుకుంటున్నారు. అయితే కొన్ని పంచాయతీల్లో బిల్లులు వస్తాయో..? రావో..? అనే సందేహంతో నిర్మాణాలు చేపట్టేందుకు సర్పంచులు ముందుకు రావడం లేదు.

66రోడ్లు రూ.2.67 కోట్లు..

మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రభుత్వం అంతర్గత రహదారుల అభివృద్ధి కోసం ఈజీఎస్ నిధులతో మండలానికి భారీగా సీసీరోడ్లు మంజూరు చేసింది. మొదటి విడుతలో రూ.1.2 కోట్లతో 25రోడ్లు, రెండో విడుతలో రూ.1.67 కోట్లతో 41 సీసీరోడ్లు మంజూరయ్యాయి. మొదటి విడుతలో మంజూరైన వాటిలో ఇప్పటివరకు 17రోడ్లు పూర్తి కాగా 2 రోడ్లు నిర్మాణ దశలో, 6 రోడ్ల పనులు ప్రారంభం కాలేదు. రెండో విడుతలో 41 రోడ్లను మంజూరు చేయగా ఇప్పటివరకు కేవలం 4 రోడ్లు మాత్రమే పూర్తయ్యాయి. 6 రోడ్లు నిర్మాణ దశలో, 31 రోడ్ల పనులు ప్రారంభం కాలేదు. అయితే ఈ నెలాఖరులోగా రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



గొల్లగూడలో పూర్తయిన సీసీరోడ్డు పనులు

ఉరుకులు, పరుగులతో నిర్మాణాలు

సీసీరోడ్ల నిర్మాణ పనులు ఉరుకులు పరుగులతో కొనసాగుతున్నాయి. ఈనెల 31లోగా పనులు పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించడంతో గ్రామాల్లో సర్పంచులంతా అప్పులు చేసి మరీ రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. సర్పంచుల పదవీ కాలం చివరిదశకు చేరుకోవడంతో గ్రామాల్లో తమ మార్క్ కనిపించేలా అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణాలు, సీసీ సైడ్‌డ్రైన్‌ల నిర్మాణాలు చేపడుతున్నారు. కొంతమంది సర్పంచులు గ్రామాలకు మంజూరైన సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు వెనుకడుగు వేస్తున్నారు. నిర్మాణాలు చేపడితే బిల్లులు సకాలంలో అందుతాయో లేదో అనే సందేహంతో రోడ్ల నిర్మాణాలపై మొగ్గు చూపడం లేదు. దీంతో ఆయా పంచాయతీలకు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉంది.

ఈ నెలాఖరులోగా పూర్తి చేస్తాం

మండలానికి మంజూరైన సీసీరోడ్లన్నీ ఈ నెలాఖరులోగా పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మొదటివిడుతలో మంజూరైన సీసీరోడ్లు దాదాపు పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. రెండో విడుతలో మంజూరైన రోడ్ల నిర్మాణాలు ఇప్పుడే ప్రారంభించాం. కొంతమంది సర్పంచులు సీసీరోడ్లు నిర్మించేందుకు ముందుకు రావడం లేదు. దాంతో కొన్ని రోడ్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదు.

– సుహాస్, ఏఈఈ, పంచాయతీ రాజ్

వందశాతం వసూళ్లు



చేడ్వాయిలో పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి జావీద్(ఫైల్)

- పన్నుల వసూలు టార్గెట్ పూర్తి
- వసూళ్లలో అధికారులు, కార్యదర్శుల ప్రత్యేక శ్రద్ధ
- గడువుకు ముందే చేరుకున్న లక్ష్యం

పెంచికల్‌పేట్: పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూళ్లు అయ్యాయి. కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి పన్ను వసూళ్లలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంతో తక్కువ కాలంలో టార్గెట్‌ను పూర్తి చేశారు. ఈనెలాఖరులోగా ఉన్నతాధికారులు వందశాతం లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇందుకోసం అధికారులు, కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. పన్నులు కట్టకపోతే ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని విస్తృత ప్రచారం చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు చెల్లించారు. గడువుకు పదిరోజుల ముందే లక్ష్యాన్ని చేరుకుని మండలం ప్రథమస్థానంలో నిలిచింది. మండలంలోని 12 పంచాయతీలకుగాను రూ.10,31,360 ఆదాయం సమకూరింది. అత్యధికంగా ఎల్కపల్లిలో రూ. 2,09,530, పెంచికల్‌పేట్‌లో రూ.38,586లు పన్నులు వసూళ్లయ్యాయి.

ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకున్నాం



పంచాయతీల్లో పన్నుల వసూళ్లకు ప్రత్యేక ప్ర ణాళికను రూపొందించాం. ఈనెలాఖరు వర కు పన్నుల వసూళ్లకు స మయం ఉన్న కార్యదర్శుల మెరుగైన పనితీరుతో గడువు కన్నా ముందే లక్ష్యాన్ని చేరుకున్నాం.పన్నుల ద్వారా పనులు చేపట్టే అవకాశం ఉంది.

– గంగాసింగ్, ఎంపీడీవో, పెంచికల్‌పేట్

షాదీఖానాకు నిధులు కేటాయించాలి

రెబ్బెన: మండల కేంద్రంలో షాదీఖానాకు నిధులు కేటాయించాలని ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కును కలిసి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల కోసం షాదీఖానా అందుబాటులో లేకపోవడంతో శుభకార్యాల నిర్వహణ కష్టతరంగా మారుతోందన్నారు. ఫంక్షన్ హాళ్లకు వేలాది రూపాయలు చెల్లించలేక పేదలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. షాదీఖానా నిధులు కేటాయించాలని కోరగా ఎమ్మెల్యే స్పందించి నిధుల మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మైనార్టీ నాయకులు జహురొద్దీన్, జహీరీబాబు, ముజమ్మిల్, ఆరీఫ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు సుదర్శన్‌గౌడ్, గుంపుల విమలేష్, సుదర్శన్‌గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న మైనార్టీలు

అభివృద్ధికి ఆమడదూరం



రాళ్లు రప్పలు తేలిన లైన్‌పటార్ రోడ్డు

- లైన్‌పటార్ గ్రామంలో అనేక సమస్యలు
- రోడ్డు, రవాణా సౌకర్యాలు, పక్కా ఇళ్లు లేవు
- ఇబ్బందుల్లో గిరిజనులు

కెరమెరి: మండలంలోని బాబేఝరి పంచాయతీలోని లైన్‌పటార్ గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. రోడ్డు సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. రవాణా సౌకర్యం లేక రాళ్లు, రప్పల దారే వారికి దిక్కయింది. ఏళ్లు గడుస్తున్నా ఉండేందుకు ఇళ్లు కూడా లేకపోయింది. గ్రామంలో 21 కుటుంబాలు ఉండగా, 134 మంది జనాభా ఉంది. అక్కడ ఉన్న వారందరు కొలాంల ఆదివాసీ తెగకు చెందిన వారు. జోడేఘాట్‌కు వెళ్లేదారిలో ఉన్న టోకెన్ మోవాడ్ నుంచి 4 కి.మీ దూరంలో ఉన్న ఆ గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. ఏళ్లు గడుస్తున్నా రహదారి సౌకర్యం లేదు. బండరాళ్లు తేలి నడిచేందుకు ఎంతో కష్టమవుతోంది. అయినా మరమ్మతు చేద్దామన్నా చిత్తశుద్ధి అధికారుల్లో లేదు. ఎండా, వానాకాలాల్లో వారి బాధలు వర్ణనాతీతం. దారి మధ్యలో చిన్న చెరువుంది. అది నిండుకుండలా ప్రవహిస్తే ఇక ఎటు వెళ్లలేని పరిస్థితి. చేతిపంపు కూడా ఒకటే ఉండడంతో కష్టం తప్పడం లేదు.



ఇదే లైన్‌పటార్ గ్రామం

అంగన్‌వాడీ, పాఠశాల లేదు

ఆ గ్రామంలో సుమారు 10 మంది చిన్నారుల చదువులకు దూరంగా ఉన్నారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల లేక వారు ఇబ్బంది పడుతున్నారు. కొందరు తల్లిదండ్రుల వెంట పొలాలకు వెళ్తుంటే, మరిందరు చిన్న పిల్లలకు రక్షణగా ఇళ్లలో ఉంచుతున్నారు. దీంతో వారందరూ చదువుకు దూరమవుతున్నారు. అంగన్‌వాడీ ద్వారా చిన్నారులకు అందే పౌష్టికాహారానికి దూరమవుతున్నారు.

రోడ్డు నిర్మించాలి



కచ్చా రోడ్డు వల్ల ఇబ్బంది పడుతున్నాం. మట్టి, రాళ్ల రప్పల రోడ్డు ఉండడంతో నడవలేక పోతున్నాం. ఇప్పుడే ఎలాగైన నడుస్తున్నా వానాకాలంలో బురదతో ఇబ్బంది అవుతోంది. మధ్యలో కాలువలు నిండిపోతాయి.

– ఆత్రం భీంరావు, గ్రామ పటేల్

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



లైన్‌పటార్ గ్రామ సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఫారెస్టు క్లియరెన్స్ లేక రోడ్డు వేయలేకపోతున్నాం. నీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడాం, త్వరలో చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణగౌడ్, ఎంపీడీవో

అటెన్షన్ ప్లీజ్.. రోడ్డుకు రంధ్రం



కెరమెరి: మండలంలోని సావర్‌ఖేడా పంచాయతీ రాంజీగూడ రోడ్డుకు రంధ్రం ఏర్పడింది. రెండు పక్కల వంతెనలు, మధ్యలో పెద్ద రంధ్రం పడి ఇనుపరాడ్లు కనిపిస్తున్నాయి. పదేళ్లవుతున్నా అధికారులు మరమ్మతు చేపట్టడం లేదు. దీంతో ఇటు గుండా రాకపోకలు సాగించే పాదాచారులు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రాత్రిసమయంలో రంధ్రంలో పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని మరమ్మతు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– అధికారి: నజిమొద్దీన్, ఏఈ, సెల్: 86394 55036

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: బలగం
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: బలగం

– ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	60
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	30
బీరకాయ	60
కాకరకాయ	50
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

–ఆసిఫాబాద్‌అర్బన్

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

రెబ్బెన: గోలేటిలోని సింగరేణి ఉన్నత పాఠశాల 1995–96 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థి దామెర ఆనంద్ గతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన కుమారుడి ప్రేమ్‌దీప్ చదువు నిమిత్తం ఆదివారం పూర్వవిద్యార్థుల మహా సమ్మేళనం తరపున రూ.15 వేల ఆర్థికసాయాన్ని ఆనంద్ ఇంటికి వెళ్లి తల్లికి అందజేశారు. తమతో పాటు కలిసి చదువుతున్న మిత్రుడు ఈ లోకాన్ని విడిచి వెళ్లడం బాధాకరమన్నారు. ప్రేమ్‌దీప్ చదువుకు ఈ నగదు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పూర్వవిద్యార్థులు పోటు శ్రీధర్‌రెడ్డి, దాట్ల శ్రీనివాస్, చేపూరి నాగేందర్, సురేందర్, నవీన్‌గౌడ్, బోగే ఉపేందర్, పంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ నుంచి దీపక్ సస్పెన్షన్

కాగజ్‌నగర్‌టౌన్: గత కొన్నిరోజులుగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న జాడి దీపక్‌ను బీజేపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడంతోపాటు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేలా, ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్‌పై వివిధ మాధ్యమాల ద్వారా విమర్శలు చేస్తున్నట్లు వివరించారు.





ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

చింతలమానెపల్లి: మండలంలోని బాలజీ అనుకోడ గ్రామంలో ఆదివారం పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా మహిళలు బోనాలతో తరలివచ్చి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎంపీపీ నానయ్య, జెడ్పీటీసీ సభ్యులు శ్రీదేవి, నాయకులు డి.వెంకయ్య, ఎల్ములే మల్లయ్య, ఉమా మహేష్, పూజార్లు దేవర వినోద్, భీమయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ వార్షికోత్సవం

కౌటాల: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయినాథునికి పాలాభిషేకం నిర్వహించారు. ఉప సర్పంచ్ పి.తిరుపతి, జాగృతి మండల కన్వీనర్ మూర్త చంద్రకళ, కమిటీ సభ్యులు వినాయక్‌గౌడ్, సత్యనారాయణగౌడ్, భాస్కర్, శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

దహెగాం: మండల సర్వసభ్యసమావేశం ఆదివారం నిర్వహించాల్సి ఉండగా కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. ఎంపీపీ సులోచన అధ్యక్షతన జరిగిన సమావేశానికి కోరం లేక వాయిదా వేశామన్నారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు.